Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 230 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 22 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చాలా చిత్తశుద్ధితో పనిచేస్తుంది

## - రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర











**మచిలీపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం చాలా చిత్తశుద్ధితో పనిచేస్తుందని, విద్య వైద్య రంగాలకు బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయిస్తుందని, మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరింత మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మంత్రివర్యులు నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. నగరంలో మంత్రి స్వయంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఆసుపత్రిలోకి ప్రవేశించి అక్కడ అడ్డదిడ్డంగా ఉన్న వాహనాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెంటనే ఆసుపత్రి పర్యవేక్షకులను, పార్కింగ్ ఇన్చార్జి వారిని పిలిపించి ఇకపై వాహనాలు ఎక్కడపడితే అక్కడ ఉంచకుండా ఒక నిర్దిష్టమైన పార్కింగ్ ప్రదేశంలో ఉంచేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ ప్రదేశంలో లేకపోతే ఆసుపత్రి బయటనే ఉంచేలా పర్యవేక్షించాలన్నారు. అనంతరం మంత్రి ఆసుపత్రిలో అన్ని విభాగాలను తనిఖీ చేసి అక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. మరల ఆసుపత్రిని తనిఖీ చేస్తానని ఎక్కడ ఏ లోకం లేకుండా అన్ని ఏర్పాట్లు సరిగా చేయాలన్నారు. తేడా వస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. అడుగడుగునా రోగులను పరామర్శిస్తూ ప్రజలతో మమేకమై వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని ఆరా తీశారు. అక్కడి రోగులు వారి బంధువులతో ముఖాముఖి మాట్లాడి వైద్యం ఎలాగుంది మర్యాదగా ఉంటున్నారా లేదా వైద్యులు అందుబాటులో ఉంటున్నారా లేదా మందులు సరిగా ఇస్తున్నారా లేదా అని ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రివర్యులు ఆసుపత్రి పర్యవేక్షకులు, జనరల్ సర్జన్, సీనియర్ వైద్యులు, ప్రొఫెసర్లతో కలిసి కూర్చొని కాసేపు వారితో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏ పరికరాలు ఉన్నాయి, ఏ పరికరాలు అవసరం ఉంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ప్రతిరోజు ఆసుపత్రికి 1600 మంది దాకా బయట నుండి రోగులు (ఓపి) వస్తున్నారని, ఇక్కడ 605 దాకా పడకలు ఉన్నాయని, ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా నడుస్తుందన్నారు. ప్రొఫెసర్లు, వైద్యులు అందరితో మాట్లాడామని వాళ్లు ఎవరైనా ఇతర ప్రాంతాల వారు అయితే తప్పనిసరిగా మచిలీపట్నంలో నివాసం ఉండే విధంగా ఏర్పాటు చేసుకోవాలని స్పష్టంగా చెప్పడం జరిగిందన్నారు. అలాగే స్టాఫ్ నర్సులు 90 మంది దాకా కొరత ఉందని వారిని త్వరలో నియమించాల్సి ఉందన్నారు. కొన్ని పరికరాల అవసరం ఉందని తన దృష్టికి వైద్యులు తీసుకొని వచ్చారన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముఖ్యంగా బయట ప్రాంతాల నుండి వచ్చే వారికి ఓపి టోకన్లు జారీలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మంగళవారం సదరం పరీక్షలు ఉండటం వలన సాధారణంగా వచ్చే రోగులకు అదనంగా సదరం పరీక్షలకు వచ్చే వ్యక్తులతో కొంత ఒత్తిడి కలుగుతున్నట్లు గమనించామన్నారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి ఆ రెండింటికి వేరువేరుగా కౌంటర్లు ఏర్పాటు చేసి ఒత్తిడిని తగ్గించాలని పర్యవేక్షకులకు సూచించామన్నారు. వారు డిఎంహెచ్వోతో మాట్లాడి డైట్ భవనంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నిరంతరం ప్రత్యేక శ్రద్ధతో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వైద్యులు కూడా బాగా సేవలు అందిస్తున్నారన్నారనీ, ఆపరేషన్ అన్ని బాగా జరుగుతున్నాయన్నారు. అయితే ప్రజల్లో సంతృప్తి స్థాయి ఇంకా పెంచవలసిన అవసరం ఉందన్నారు. వెంటిలేటర్ల అవసరం ఉందని పర్యవేక్షకులు చెప్పారని కొంత సిఎస్ఆర్ నిధులు, కొంత ప్రభుత్వ నిధులతో వాటిని సమకూర్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆసుపత్రిలో కొంత భద్రతా లోపం కూడా కనపడుతోందని ప్రధానంగా పార్కింగ్ సమస్య ఉందన్నారు. ఆసుపత్రికి వచ్చిన వారు ఎక్కడపడితే అక్కడ తమ వాహనాలను ఆసుపత్రిలో నిలుపుతున్నారని, ఇదివరకు పార్కింగ్‌లో పెట్టే వారని ఇప్పుడు మరలా సమస్య వచ్చిందన్నారు. ఇకపై ఆసుపత్రిలోకి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలన్నింటిని పార్కింగ్ ప్రదేశంలో నిలిపి ఉంచాలని, లేకుంటే బయటే ఉంచాలని పర్యవేక్షకులకు స్పష్టం చేశామన్నారు. పారిశుధ్యం కూడా చాలా బాగుండాలని ఎక్కడైనా తేడా వస్తే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్కు హెచ్చరించారు. ఆసుపత్రిలో కొంత సిబ్బంది కొరత ఉందని అవసరం మేరకు త్వరలో నియామకం చేపడుతామన్నారు. ఆరోజున వైద్య కళాశాల వస్తే అన్ని రకాల చికిత్సలు అందుబాటులోకి వస్తాయని భావించామన్నారు. ఇవాళ పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు కూడా మంజూరు అయ్యాయని, ఆసుపత్రిలో రోగులకు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లీలా ప్రసాద్, ఆర్ ఎం ఓ నిరంజన్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసరావు, భగత్ సింగ్ నాయక్, ఎస్సీ విజిలెన్స్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ తదితర స్థానిక నాయకులు, పలువురు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, రోగులు,వారి బంధువులు పాల్గొన్నారు.

# సింగపూర్‌లో ఏపీ మంత్రుల బృందం పర్యటన

## - సామాజిక సమగ్రత, ప్రజా అనుసంధానంలో సింగపూర్ మోడల్ అధ్యయనం - తొలి రోజు కార్యక్రమాలు విజయవంతం





**టాంపిన్స్, సింగపూర్ :** సింగపూర్‌లో ఏపీ మంత్రుల బృందం చేస్తున్న అధ్యయన పర్యటనలో భాగంగా తొలి రోజు కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయి. ప్రజల భాగస్వామ్యం, సామాజిక సమగ్రత అంశంపై ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రుల బృందం పాల్గొంది. ఉదయం సింగపూర్ చేరుకున్న అనంతరం యంత్రలో నిర్వహించిన అధికారిక భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగపూర్ విదేశాంగ, వాణిజ్య శాఖల మంత్రి స్థాయి ప్రతినిధి మిస్ గాన్ సియో హువాంగ్ పాల్గొని పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనపై మంత్రుల బృందంతో పరస్పర చర్చలు జరిపారు. తదుపరి ఆర్ టాంపిన్స్ హబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఫ్రాన్సిస్ చుంగ్ ప్రారంభ వ్యాఖ్యలు చేశారు. అనంతరం సింగపూర్ మాజీ ఉప కార్యదర్శి అంగ్ హాక్ సేంగ్ సింగపూర్ సామాజిక నిర్మాణం, సోషల్ కంపాక్ట్, ప్రజల భాగస్వామ్యం, పౌరులతో కలిసి సేవల అందజేత వంటి అంశాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు.

తరువాత సింగపూర్‌లో అతిపెద్ద లైఫ్ స్టైల్ సెంటర్‌గా ఉన్న అవర్ టాంపైన్స్ హబ్ సందర్శించి అక్కడ క్రీడలు, స్విమ్మింగ్ పూల్స్, లైబ్రరీలు, మాల్స్, ఫెస్టివ్ ఆర్ట్స్ థియేటర్ ను మంత్రులు సందర్శించారు. ఈ సందర్భంగా అవర్ టాంపిన్స్ హబ్ అసోసియేషన్ ప్రతినిధులు సింగపూర్ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, ప్రజా సేవల అమలు విధానంపై మంత్రులకు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం ఏ విధంగా, పాదర్శకంగా జరుగుతుందో సింగపూర్ ప్రతినిధులను అడిగి ఏపీ మంత్రులు తెలుసుకున్నారు. సాయంత్రం 'మీట్–ది–పీపుల్ సెషన్'లో పాల్గొని ప్రజలతో ప్రజాప్రతినిధులు ఎలా నేరుగా మమేకమవుతూ.. సమస్యలను పరిష్కరిస్తారో ప్రత్యక్షంగా గమనించారు. ఈ కార్యక్రమంలో మిస్ గాన్ సియో హువాంగ్ పాల్గొని ప్రజలతో పరస్పర చర్యలను నిర్వహించారు. ఈ అధ్యయన పర్యటన ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలు, పారదర్శకత, సమగ్ర అభివృద్ధి లక్ష్యాలు వంటి అంశాలను అవగాహన చేసుకుని, వాటిని మన రాష్ట్రంలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తున్నామని మంత్రుల బృందం తెలిపింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దేందుకు ఉపయోగపడే అనుభవాలు లభిస్తున్నాయని బృందం పేర్కొంది. మంత్రుల బృందంలో పి. నారాయణ, వంగలపూడి అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బి.సి జనార్దన్ రెడ్డి, ప్లానింగ్ సెక్రటరీ అనంత్ శంకర్, APSDPS ED ఆలపర్తి వెంకటేశ్వరరావు ఉన్నారు. పర్యటనలో భాగంగా సింగపూర్ ఇండియన్ హై కమిషనర్‌తో ఏపీ మంత్రుల బృందం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యింది.

# అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్‌లు : రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

## - బీసీల అభ్యున్నతే సీఎం చంద్రబాబు లక్ష్యం - చట్ట సభల్లో అన్ని బీసీ కులాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నదే చంద్రన్న ధ్యేయం - త్వరలో ప్రారంభమయ్యే ఆదరణ 3.0లో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యం

## - విశ్వబ్రాహ్మణుల కోసం మంగళగిరిలో శిక్షణ కేంద్రం ఏర్పాటు : మంత్రి సవిత





**అనంతపురం, (రాజధాని వార్తలు):** అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్ లు నిర్మించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. చట్ట సభల్లో అన్ని కులాలకు ప్రాతినిధ్యం కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. అనంతపురం నగరంలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పాలక మండలి సభ్యుల అభినందన కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. బీసీల అభ్యున్నతి కోసమే అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు వెనుబడిన వర్గాలకు అన్ని విధాలా ప్రాధాన్యమిస్తున్నారన్నారు. బీసీల రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు కోసం వెన్నుదన్నుగా నిలుస్తున్నారన్నారు. చట్ట సభల్లో అన్నీ బీసీ కులాలకూ ప్రాతినిధ్యం కల్పించాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్‌లు నిర్మించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఇందుకోసం గతంలో రూపొందించిన అంచనాలను సవరిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విశ్వ బ్రాహ్మణులకు అన్ని విధాలా ప్రోత్సాహించాలని కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. త్వరలో అమలు చేయబోయే ఆదరణ 3.0 పథకంలో విశ్వ బ్రాహ్మణులకు ఆధునిక పరికరాలు అందించే ఆలోచన చేస్తున్నామన్నారు. మారుతున్న కాలంతో పాటు నేటి తరం అభిరుచులకు అనుగుణంగా విశ్వ బ్రాహ్మణులకు శిక్షణ ఇవ్వడానికి మంగళగిరిలో స్కిల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. విశ్వ బ్రాహ్మణుల ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ, విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించామన్నారు.

గత ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. అనంతరం రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ పాలక మండలి సభ్యులను ఆ సామాజిక వర్గీయులు మంత్రి చేతుల మీదు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, కూటమి నాయకులు, కార్యకర్తలు, విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిల్ చంద్ర పునేఠా





**విజయవాడ, (రాజధాని వార్తలు):** విజయవాడ బందరు రోడ్డులో గల రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం విశ్రాంత ఐఏఎస్ అధికారి అనిల్ చంద్ర పునేఠా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) బాధ్యతలు స్వీకరించారని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం అనిల్ చంద్ర పునేఠా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఐదు సంవత్సరాల కాలానికి నియమితులైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి డాక్టర్ ఏ.మల్లికార్జున ఆ ప్రకటనలో తెలిపారు.

# రాష్ట్రంలో ఎండ, వడగాలులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి

**అమరావతి, (రాజధాని వార్తలు):** బుధవారం 76 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, మరో 134 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎల్లుండి 51 తీవ్ర, 94 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ప్రజలు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**నేడు తీవ్ర వడ గాల్పులు వీచే జిల్లాలు:**
శ్రీకాకుళం 19, విజయనగరం 21, మన్యం 3, అల్లూరి 4, పోలవరం 5, విశాఖ1, అనకాపల్లి 15, కాకినాడ 6, తూర్పు గోదావరి 2 మండలాల్లో తీవ్ర వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉందని వెల్లడించారు. మంగళవారం తిరుపతి(జి) వరదయ్యపాలెం 44.4 డిగ్రీలు, ప్రకాశం (జి) కొప్పెరపాడులో 44.1 డిగ్రీలు, నెల్లూరు(జి) కొమ్మిపాడు, కాకినాడ (జి) కరపలో 43.6 డిగ్రీలు, కడపలో 43.5 డిగ్రీలు, అనంతపురం(జి) తెరన్నపల్లిలో 43.4 డిగ్రీలు, మార్కాపురం(జి) నందన మారెళ్లలో 43.3 డిగ్రీలు, శ్రీసత్యసాయి (జి) తలుపుల, నంద్యాల(జి) సంజామలలో 43.2 డిగ్రీలు, పల్నాడు(జి) గురజాలలో 42.9 డిగ్రీలు, కర్నూలు(జి) తోవి, అన్నమయ్య(జి) నూలివీడులో 42.5 డిగ్రీలు, చిత్తూరు(జి) తవణంపల్లెలో 42.3 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు పేర్కొన్నారు. 288 మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు వెల్లడించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలని, గుండె సంబంధిత వ్యాదులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మరోవైపు రేపు మన్యం, అల్లూరి, పోలవరం కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పని చేసే రైతులు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు.


# విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు


**- టిడిపి అధ్యక్షులు పాడి వెంకటసుబ్బయ్య యాదవ్ - ఓజిలిలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు**




**ఓజిలి, (రాజధాని వార్తలు):** ఏపీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్‌తో ముందుకు వెళుతున్న నేత అని ఓజిలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాడి వెంకట సుబ్బయ్య యాదవ్ కొనియాడారు. సోమవారం మండల కేంద్రమైన ఓజిలిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ అభివృద్ధిలో చంద్రబాబు నాయుడు కృషి శ్లాఘనీయం అని అన్నారు. రాబోయే రోజులలో అభివృద్ధి సంక్షేమం కొరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌కు ఎంతైనా అవసరమని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు చిన్న చిన్న మనస్పర్ధలు పక్కనపెట్టి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండల మాజీ అధ్యక్షులు గుజ్జులపూడి విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అంటే అభివృద్ధి అని, అభివృద్ధికి చంద్రబాబు నాయుడు చిరునామాని కొనియాడారు. టిడిపి సీనియర్ నాయకులు కంకణాల సత్య వరప్రసాద్ నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి దివాళ్ళ తీసినప్పుడు ప్రజలకు చంద్రబాబు నాయుడు గుర్తుకొస్తారని, అభివృద్ధి చేసేందుకు ప్రజలు ఓట్లు వేస్తారని అన్నారు. కురుగొండ పిఏసిఎస్ అధ్యక్షులు దారా అంకయ్య మాట్లాడుతూ టిడిపి నాయకులు అందరూ ఐక్యంగా ఉండాలని సూచించారు. అలాగే గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అది టిడిపితోనే సాధ్యమని అన్నారు. మండల మైనార్టీ యువ నాయకుడు షేక్ అల్లాహ్ భక్షు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని అన్నారు. యువనాయకుడు కార్తీక్ రాజు మాట్లాడుతూ 1990 దశకంలో కంప్యూటర్ లేని రోజుల్లో చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. అలాగే అమరావతిలో క్వాంటం అభివృద్ధికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని రానున్న రోజు లలో చదువుకున్న యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళకుండా ఇది ఉపయోగపడుతుందని అన్నారు. టిడిపి సీనియర్ నాయకులు టిడిపి సీనియర్ నేత కొండూరు ఈశ్వర్ రాజు నాయకులందరూ ఐక్యంగా ఉండి రానున్న స్థానిక ఎన్నికలలో మండలంలోని 26 పంచాయతీలు కైవసం చేసుకోవాలని కోరారు. అనంతరం కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట ఏఎంసి డైరెక్టర్ కాటూరి కోటేశ్వరావు యాదవ్, కుందాం పిఎసిఎస్ అధ్యక్షులు గుంటమడుగు పురుషోత్తం రాజు, మైనార్టీ జిల్లా నేతలు షేక్ ఖలీల్, రఫీ, టిడిపి సీనియర్ నాయకులు, కొండూరు సుబ్బారెడ్డి, కలపాటి పుల్లయ్య, బత్తల రవీంద్ర రెడ్డి, కొండ్లపూడి సూరి రెడ్డి, నన్నూరు శ్రీనివాసరావు, మంగళపూరి.ఫ్రాంక్లీన్ చందన కుమార్, నల్లమాకు కమలాకర్, మూసులూరు శ్రీనివాసులు, రైతు నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

# సీడ్ యాక్సిస్ రోడ్డుపై లెగస్ట్రోమియా అందాలు









**అమరావతి, (రాజధాని వార్తలు):** రాజధాని అమరావతికి ప్రధాన అనుసంధాన రహదారి అయిన సీడ్‌యాక్సిస్ రోడ్డుపై సెంట్రల్ మీడియన్‌లో లెగస్ట్రోమియా పూలు విరగబూస్తున్నాయి. ఏకంగా 50 సెంటీ మీటర్ల పొడవుతో ఉండే ఈ పూలు క్వీన్స్‌పిసియోజా జాతికి చెందినవి. ఏప్రిల్, మే మాసాలలో గుత్తులు గుత్తులుగా పూసి ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకోవటం లెగస్ట్రోమియా పూల నైజం. వంగపండు, గులాబీ, లేత గులాబీ ఇలా మూడు రంగుల్లో పూస్తున్నాయి. సహజంగా వీచే గాలులకు లెగస్ట్రోమియా పూల గుత్తులు గంతులు వేసినట్లు ఆహ్లాదపరుస్తుంటాయి. 2018వ సంవత్సరంలో ఏడీసీ సీఎండీ డి.లక్ష్మీపార్థసారథి వారు సీడ్ యాక్సెస్ రోడ్డుపై హార్టికల్చర్ అధికారులతో లెగస్ట్రోమియా పూల చెట్లను నాటించారు. ఎనిమిది సంవత్సరాలు కలిగిన ఈ పూల చెట్లకు విరివిగా నైట్రోజన్, పాస్ఫరస్, పొటాషియం ఎరువులను మరియు ఘనజీవామృతాన్ని సిబ్బంది అందిస్తున్నారు. ఈ రహదారిపై 4 కి.మి మేర 8 వేల మొక్కలు ఉన్నాయి. అయిదు అడుగుల వరకు పెరిగే ఈ మొక్కల జీవిత కాలం 15 సంవత్సరాలు. పోషణ బలాన్ని బట్టి మరో 5 సంవత్సరాలు జీవించొచ్చని నిపుణుల అంచనా. మొక్కలకు నల్ల పేను బంక వంటి చీడపీడలు సోకకుండా, తెల్ల దోమల బారిన పడకుండా ప్రతి రోజూ ప్రత్యేక నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేసి మొక్కల తల భాగం నుంచి కాండం వరకు వాటరింగ్ చేస్తున్నారు. మూడు నాలుగు లెగస్ట్రోమియా పూల గుత్తులను కలిపితే సహజ సిద్ధమైన పుష్పగుచ్ఛంగా తయారవుతుంది. ఇవి వేసవితో పాటు అగస్టు, సెప్టెంబరు నెలలో కూడా రెండో దశ పూస్తాయి. అయితే కొన్ని చెట్లు ఏడాది పొడవునా పూస్తున్నాయి.

**లెగస్ట్రోమియా పూర్తిగా ఔషధ గుణాలు కలిగిన మొక్క:**
లెగస్ట్రోమియా పువ్వులు, ఆకులలో యాంటి ఆక్సిడెంట్లు, యాంటి ఇన్‌ఫ్లేటరీలు అధికంగా ఉండే వీటిని ఫిలిప్పియన్లు వీటి ఆకుల నుంచి టీ తయారు చేసుకుంటారు. అంతేకాదు టైప్–2 డయాబెటిక్ ఔషధాల తయారీలో వినియోగిస్తారు. రక్తపోటు నివారణ, గాల్‌బ్లాడర్, కిడ్నీలో రాళ్ల నివారణ, బ్లాడర్ డిస్‌ఫంక్షనింగ్ వంటి వ్యాధుల నివారణ మందుల్లో వినియోగిస్తారు.

# ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి ప్రధాత సీఎం చంద్రబాబు

**- అంగరంగ వైభవంగా సీఎం జన్మదిన వేడుకలు - దార్శనికులు సీఎంకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ జన్మదిన శుభాకాంక్షలు - 40 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేసిన మత్స్యకారులు - కటౌట్‌కు పాలాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించిన మత్స్యకారులు**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** అమరావతి నిర్మాత, అభివృద్ధి ప్రదాత, విజనరీ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కోవూరు నియోజకవర్గం విడవలూరు మండలం రామచంద్రపురం పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని కేక్ కట్ చేసి సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 40 అడుగుల భారీ కటౌట్‌కు మత్స్యకారులు పాలాభిషేకం చేశారు. డ్రోన్ సహాయంతో కటౌట్‌పై పుష్పాభిషేకం నిర్వహించారు. జై చంద్రబాబు, జై తెలుగుదేశం నినాదాలతో లక్ష్మీపురం గ్రామం దద్దరిల్లింది. చంద్రబాబు నాయుడు అంటే కేవలం పేరు కాదని, అదొక అభివృద్ధి బ్రాండ్ అని నినదించారు. ఈ సందర్భంగా ఆయన అందిస్తున్న సుపరిపాలనను కొనియాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ సంక్షేమం, అభివృద్ధికి ఆటంకం కలగకుండా చంద్రబాబు నాయుడు పాలన అందిస్తున్నారని అన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను అమలు చేస్తూ గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తున్న నవ్యాంధ్ర నిర్మాతకు ప్రజలందరూ అండగా నిలవాలని వారు ఆకాంక్షించారు.

# క్రమశిక్షణతో ఉన్నత విద్యావంతులై ఆదర్శంగా నిలవండి : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యను కల్పించాలన్న ఉన్నత లక్ష్యంతో పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు డాక్టర్ పి.నారాయణ ఆలోచనలతో ఏర్పాటు చేసిన వి.ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత విద్యావంతులుగా ఎదిగి అందరికీ ఆదర్శంగా నిలవాలని కమిషనర్ వై.ఓ. నందన్ ఆకాంక్షించారు. స్థానిక వి.ఆర్. మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ ప్రాంగణంలో 180 మంది విద్యార్థులకు ప్రీ గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్స్, మెడల్స్‌ను సోమవారం అందచేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విద్యతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చింతాల వెంకటరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటరమణ, అసిస్టెంట్ హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణ, పి.ఈ.టి. గురు ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి, హరిత చంద్రకళ, ఎం.ఈ. ఓ.హమీద్, 436 మంది ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# చూపులేని కళ్ళకు వెలుగు రేఖ.. విపిఆర్ నేత్ర

**- కోవూరు ప్రజాశీసుల మధ్య వైభవంగా ప్రారంభమైన విపిఆర్ నేత్ర రెండో బస్సు - సేవలను ప్రారంభించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ - సీఎం చంద్రబాబు జన్మదిన కానుక విపిఆర్ నేత్ర - సీఎం చంద్రబాబుని కోవూరుకు తీసుకువచ్చేలా ప్రయత్నిస్తాం - అత్యంత కచ్చితత్వంతో పరీక్షలు, అవసరమైనవారికి అద్దాలు - ప్రజలకు వేగవంతంగా సేవలు అందించాలనే మరో విపిఆర్ నేత్ర బస్సు ప్రారంభించాం - హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధులు, మహిళలు - మా కంటికి ఇన్నేళ్లకు వెలుగొచ్చిందని సంబరాలు**













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పేదల పెన్నిధిగా, అభాగ్యులకు అండగా.. నిరంతర శ్రామికుడిగా.. సేవకు నిలువెత్తు రూపంగా నిలిచే వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. తన అమృత హస్తాలతో ప్రారంభించిన విపిఆర్ నేత్ర యాత్ర ఇప్పటికే ఉదయగిరి ప్రాంతంలో తన అమూల్యమైన సేవలందిస్తోంది. ఇప్పుడు మరో విపిఆర్ నేత్ర బస్సు.. కోవూరు నియోజకవర్గం నుంచి తన సేవలను అందించేందుకు సిద్ధమైంది. అఖండ ప్రజాశీసుల మధ్య లక్ష్మీపురం గ్రామంలో వేడుకగా ప్రారంభమైంది. చూపు మందగించిన కళ్ళకు కంటి వెలుగై.. అభాగ్యులకు అండదండలై.. ఆపద్బాంధవుడై.. ప్రజా సేవలో శిఖరసమానులైన నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సోమవారం విడవలూరు మండలం లక్ష్మీపురం నుంచి విపిఆర్ నేత్ర రెండో బస్సు సేవలను ప్రారంభించగా..భారీగా తరలివచ్చిన ప్రజలు తమ నిండు మనసుతో ఆశీసులు అందించి దీవించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులకు గ్రామస్తులు, మత్స్యకారులు, భారీ గజమాలతో స్వాగతం పలికారు. కర్పూర హారతులు పట్టి తమ అభిమాన నాయకులను ఆహ్వానించారు. అనంతరం సభా ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన విపిఆర్ నేత్ర బస్సును ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతమ్మ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటిచూపు సరిగా లేని పలువురికి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేసి అక్కడికక్కడే కంటి అద్దాలు అందజేశారు. వృద్ధులు, మహిళలు, పెద్దవారు కంటి పరీక్షలు చేయించుకుని, ఇన్నాళ్లకు తమ చూపు స్పష్టంగా ఉందంటూ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ మురిసిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని విపిఆర్ నేత్ర 2 సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇది ఆయన పుట్టిన రోజుకు తమ కానుక అని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటి సమస్యలపై అవగాహన లేక ఎంతో మంది తమ చూపును నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. విపిఆర్ ఫౌండేషన్ తరపున ఇప్పటికే గ్రామస్థులకు తాగడానికి నీరు, దివ్యాంగులు ఆత్మ ధైర్యంతో బతికేందుకు ట్రై సైకిల్స్, పేద పిల్లలు చదువుకునేందుకు విపిఆర్ విద్య వంటివి ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఏదో చేయాలన్న తపన నుంచి విపిఆర్ నేత్ర కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు.

మన శరీరంలో కళ్ళు అతి ముఖ్యమైనవని, కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమేనన్నారు. మత్స్యకారులకు ప్రాధాన్యమిస్తూ ఇక్కడి నుంచి సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. తటి ముఖ్యమైన నేత్రాలతో ఈ అందమైన ప్రపంచాన్ని చూపిం చేందుకు విపిఆర్ నేత్ర తోడుగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు చేయించుకుని అద్దాలు అందుకున్న వారితో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల అభిప్రాయాలను తెలు కున్నారు. సీఎం చంద్రబాబులాంటి క్రమశిక్షణ గల వ్యక్తి పాలనలో పనిచేయడం గర్వంగా ఉందని, ఆయన చేసే దాంట్లో మనం 10 శాతం మాత్రమే చేస్తున్నామన్నారు. మంత్రి నారా లోకేష్ గారు కూడా సమర్థవంతంగా పాలన సాగిస్తున్నారని చెప్పారు. డిప్యటీ సీఎం ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆయన ఆకాంక్షిం చారు. ఎంతో ఉన్నత ఆశయంతో చేపట్టిన విపిఆర్ నేత్ర కార్యక్ర మాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రశాం తమ్మ మాట్లాడుతూ...ఈ రోజు చరిత్రలో లిఖించదగ్గ రోజని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి చేస్తూ సుపరిపాలన అందిస్తున్నా రన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేశారని అన్నారు. త్వరలోనే మత్స్యకారులకు వేట నిషేధ భృతి అందుతుందని, ఆ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా సీఎం చంద్రబాబుని ఇదే ప్రాంతానికి ఆహ్వానిస్తామన్నారు. ఆయన్ను కోవూరు తీసుకు వచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఉదయగిరిలో ప్రారంభించిన బస్సు ద్వారా 7 మండలాల్లో 40 వేల మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. ప్రారంభించి ఆరు నెలలైనా ఇంకా ఒక్క నియోజకవర్గం పూర్తి కాలేదని, ప్రజలకు వేగంగా సేవ అందించేందుకు మరో బస్సునను తయారు చేయించి ఇక్కడి నుంచి ప్రారంభించామన్నారు. మొత్తం పార్లమెంట్ నియోజకవర్గాలు పూర్తయ్యే సరికి 4-5 ఏళ్లు పడుతుందన్న ఉద్దేశంతో మరో బస్సును తీసుకువచ్చామన్నారు. మత్స్యకారులకు అండగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఉంటారని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి దంపతులకు మత్స్యకారులు ధన్యవాదాలు తెలిపారు. తమ కంటి సమస్యలకు పరిష్కారం చూపిన వారికి జీవితాంతం రుణపడి ఉంటామని హర్షం వ్యక్తం చేశారు.

**జెట్టీ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం..**

ఈ సందర్భంగా స్థానికంగా పొన్నపూడి పాటూరు వద్ద ఫిషింగ్ జెట్టీ ఏర్పాటు చేయాలని స్థానిక మత్స్యకారులు కోరగా.. ఎంపీ వేమిరెడ్డి స్పందిస్తూ.. ఇక్కడ ఫిషింగ్ జట్టు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామని అధికారుల బృందం కూడా ఇటీవల పరిశీలించినట్లు వెల్లడించారు. మత్స్యకారులకు ఎప్పుడూ అండగా ఉండేది కోటమే ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ప్రశాంతమ్మ వెల్లడించారు.

## ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల జనగణన అంశంపై కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం అందించిన విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఖజానా వెంకట శేషయ్య ఆచారి



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** "ప్రభుత్వం నిర్వహిస్తున్న కుల జనగణన అంశంపై నెల్లూరు జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందించిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఖాజన వెంకట శేషయ్య ఆచారి" మాట్లాడుతూ రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ కులానికి ఐదువృత్తులని కమ్మర, వడ్రంగి, కంచర, శిల్పి, స్వర్ణకార వృత్తులు మా కుటుంబాల నుంచి మేము చేస్తున్నామని సుమారుగా 20 లక్షల జనసాంద్రత కలిగినటువంటి సామాజిక వర్గమని, ప్రభుత్వం దృష్టిలో రాష్ట్రంలో కేవలం రెండున్నర లక్షలు అనే చూపిస్తున్నారని, మేము జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల, గ్రామ స్థాయిలో సహా తిరిగి సుమారుగా నెల్లూరు జిల్లా సుమారు 35 వేల కుటుంబాలు 1,00,000 జనాభా ఉన్నారని అదేవిధంగా రాష్ట్రంలో మొత్తం 20 లక్షల సామాజిక వర్గమని తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం జన గణన విషయంలో వృత్తుల వారీగా విభజిస్తూ ఉందని అలా కాకుండా మా విశ్వబ్రాహ్మణ కుటుంబాలు ఐదువృత్తుల వారి కుటుంబాలని నిశితంగా పరిశీలించి కుల జన గణన నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీమంతుల రఘునాథ్ ఆచారి, సంఘ యువజన నాయకుడు ఉదయగిరి నిరంజన్ ఆచారి మొదలగు వారు పాల్గొన్నారు.

## కోవూరు అన్న క్యాంటీన్‌లో ఘనంగా సిఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని రాష్ట వ్యాప్తంగా అన్న క్యాంటీన్లో భోజనం చేసే పేదల ఆకలి తీర్చాలన్న ఉద్దేశంతో ఆయన సతీమణి నారా భువనేశ్వరి 76 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అభిమానుల మధ్య ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు అన్న క్యాంటీన్‌లో సిఎం చంద్రబాబు నాయుడు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్నా క్యాంటీన్ వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం అన్నా క్యాంటీన్లో భోజనం చేసేందుకు వచ్చిన వారికి స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడమే పరమావధిగా భావించే నాయకుడు చంద్రబాబు ఆలోచనల నుంచి పుట్టిన అన్నా క్యాంటీన్లు నేడు లక్షలాది మందికి ఆకలి తీరుస్తున్నాయని కొనియాడారు. అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదని అభిమానంతో తీసుకొచ్చే బొకేలు, పూలమాలలకు బదులు నారా భువనేశ్వరి స్ఫూర్తిగా ఆ డబ్బులు అన్న క్యాంటీన్లకు విరాళంగా యివ్వాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి నాయకులకు హితోపదేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి జన్మదిన కానుకగా విపిఆర్ ఫౌండేషన్ ద్వారా విడవలూరు మండలంలో ఈరోజు ప్రారంభించిన విపిఆర్ నేత్ర గురించి ప్రస్తావించారు. అలాగే బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో సిఎం చంద్రబాబు నాయుడు డ్రీమ్ ప్రాజెక్ట్ పి4 ద్వారా నిర్మించిన మార్కెట్ కాంప్లెక్స్ కూడా జన్మదిన కానుకగా అందివ్వనున్నట్టు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోవూరు మండల తెలుగు దేశం ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బాబు పుట్టిన రోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

**- మంత్రి కొండపల్లి ఆధ్వర్యంలో నెలివాడలో మెగా రక్తదాన శిబిరం - 57వ సారి రక్తదానం చేసిన డి.వి.ఆర్ మాస్టారు**





**బొండపల్లి, (గజపతినగరం), (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని నెలివాడ ఎస్ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజా క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న అలుపెరుగని నాయకుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు. ఆయన పుట్టిన రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని, రక్తదానం చేయడం అంటే ప్రాణదానంతో సమానమని, యువత ఇటువంటి సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఈ మెగా రక్తదాన శిబిరానికి నియోజకవర్గ స్థాయి నుంచి భారీగా స్పందన లభించింది. ఈ మెగా రక్తదాన శిబిరంలో 316 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. ముఖ్యంగా డివిఆర్ మాస్టారు 57వ సారి రక్తదానం చేయడం ఈ రక్తదాన శిబిరంలో జరిగిన గొప్ప విషయం. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పీవీవి గోపాలరాజు, మాజీ జెడ్పిటిసి మక్కువ శ్రీధర్, సాయి సిద్ధార్థ కళాశాలల కరస్పాండెంట్ సీరంరెడ్డి చంద్రశేఖర్,టిడిపి నాయకులు సీరంరెడ్డి రామ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ వైకుంతం ప్రదీప్ కుమార్, పి ఎస్ సి ఎస్ అధ్యక్షులు బంగారు నాయుడు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు, మెడికల్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

## కోట మండలంలో అంగన్వాడీ నియామకాలపై గిరిజనుల ఆవేదన

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లాలోని కోట మండలం కొక్కుపాడు గ్రామ పరిధిలో గల పలుగాటి నరసింహారెడ్డి కాలనీలో అంగన్‌వాడి నియామకాలపై గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన మహిళ పోట్లూరు సుభాషిని మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాలనీలో సుమారు 115 కుటుంబా లకు చెందిన గిరిజనులు నివసిస్తున్నప్పటికీ, అంగన్ వాడి టీచర్ మరియు సహాయకురాలి పోస్టులను స్థానిక గిరిజనులకు కాకుం డా గిరిజనేతరులకు కేటాయించారని ఆరోపించారు. దీనివల్ల గిరిజనుల హక్కులు హరించబడుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని, చివరకు నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్‌కు ఫిర్యాదు చేసినా కూడా స్పందన రాలేదని పేర్కొన్నారు. ఇంకా, సమస్యపై ప్రశ్నిస్తే అంగన్ వాడి కేంద్రాన్ని ఎత్తివేస్తామని అధికారుల నుండి బెదిరింపులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 30, 2025న విడుదలైన అధికార ప్రకటనలో పేర్కొన్న అర్హతలను పాటించకుండా నియామకాలు జరిగాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో జిల్లా మరియు రాష్ట్ర స్థాయి అధికారులు వెంటనే విచారణ జరిపి గిరిజనులకు చెందవలసిన ఉద్యోగాలను గిరిజనులకే కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు. గిరిజన సంఘ నాయకులు తమ సమస్యను గుర్తించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

rajadhanivartalu.com



# సంపాదకీయం

## కులమూ.. మనం లెక్కించలేని అశక్తతా!

'లెక్కించగలిగినది ప్రతిదీ విలువైంది కాదు. విలువైన ప్రతిదాన్నీ లెక్కించనూ లేం' ఐన్‌స్టీన్ స్వయంగా అన్నట్లుగా ఈ మాటలు ఎప్పటినుంచో చలామణిలో ఉన్నాయి. వీటినే స్ఫూర్తిగా తీసుకుని తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన కులగణనను (సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే) అర్థంచేసుకుంటే దాని పరిమితీ, పరమార్థతా తెలుస్తాయి. ఇలా అర్థం చేసుకోవాలన్న అభ్యర్థన సర్వే సారాంశాన్ని వివరించే పేజీల్లోనే ఉంది. విలువైన ప్రతి విషయాన్ని లెక్కించాలన్న కుతూహలం ఈనాటిది కాదు. అసలు ఈ కుతూహలంతోనే మనుషుల ప్రగతి ప్రయాణం మొదలైంది. అంకెలను కనిపెట్టటం అందులో భాగమే. అంకెల శాస్త్రం ఇప్పుడున్న స్థాయిలో ఉండటానికి భారతీయులుగా మన కృషి చాలా ఉంది. సున్నాను కనిపెట్టి, దశాంశపద్ధతిని అమల్లోకి తెచ్చి గణాంక విప్లవానికి మనం దోహదం చేశాం. కానీ అంకెలను కీలకరంగాలకు అన్వయించి సమాచారాన్ని నమోదు చేయటంలో మనం ఒకప్పుడు చాలా వెనుకబడి ఉన్నాం. గ్రామాలు మనకు వేల ఏళ్ల నుంచీ ఉన్నాయి. వాటికి సంబంధించిన జనాభా లెక్కలు ఇటీవల కాలం వరకూ అసలు లేవనే చెప్పుకోవచ్చు. అదే చైనాలో అయితే వందలేళ్ల నాటి గ్రామాలకు చెందిన జనాభా లెక్కలు చాలా వరకూ పక్కాగా ఉన్నాయి. తరతరాల నుంచి గ్రామాల జనాభాలో వచ్చిన మార్పులనూ, పంట భూముల వివరాలనూ అర్థం చేసుకోవటం చైనాలో చరిత్రకారులకు చాలా సులువు. మనకు చాలా కష్టం. పాతకాలం విషయాలకు మాత్రమే ఈ ఇబ్బందులు ఉన్నాయని సరిపెట్టుకోలేం. ఓటర్ల జాబితా సమగ్ర పరిశీలన పేరిట జరుగుతున్న తతంగాన్ని చూస్తే ఇదే అర్థం అవుతుంది. పదిశాతానికి పైగా ఓటర్లను జాబితాల నుంచి తొలగించారు. అనర్హులను ఎప్పటికప్పుడు గుర్తించే పద్ధతి పకడ్బందీగా లేదు. వివిధ విభాగాల మధ్య సమన్వయమూ కనపడదు. ఓటర్ల జాబితాలోని కోట్ల తప్పిదాలు మన లెక్కల నిర్వహణకు నిలువుటద్దంగానే పరిగణించొచ్చు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన విలువైన ప్రతిదాన్నీ నిజంగా లెక్కించగలిగిందా? అన్న ప్రశ్నవేసుకుని పరిశీలన జరిపితే నూటికినూరుపాళ్లూ జవాబు సంతృప్తికరంగా రాదు. సర్వే చాలా వరకూ ప్రజలు స్వచ్ఛందంగా ఇచ్చే సమాచారంపైనే ఆధారపడటం వల్ల పరిమితులు చాలా ఉన్నాయి. ఈ పరిమితుల్లోనే అదిచ్చే విలువైన సమాచారమూ ఉంది. కానీ కొన్ని పరిమితులను తేలికగా తీసుకోలేం. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమాచారాన్ని మొత్తం తీసుకోవాలని సర్వే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లాలన్న ఆ లక్ష్యాన్ని పూర్తిగా సాధించారని చెప్పలేం. అట్లా వెళ్లి ఉంటే జనాభా సంఖ్యలో చాలా మార్పు కనపడేది. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం, తెలంగాణలో 3.50 కోట్ల మంది ఉన్నారు. 14ఏళ్ల తర్వాత జరిగిన కులగణన సర్వేలో దీని పెరుగుదల చాలా నామమాత్రంగా నమోదైంది. 4 లక్షల మంది మాత్రమే ఈ 14 ఏళ్లలో అదనంగా తోడయ్యారు. 2001-2011 మధ్య తెలంగాణ జనాభా (30,987,271- 35,003,674) 40 లక్షల దాకా పెరిగింది. ఏడాదేడాదికి సంతాన సాఫల్యతా రేటు తగ్గటం, రాష్ట్ర విభజనతో ఆంధ్రాకు కొందరు ప్రజలు తరలి వెళ్లటం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నా 14 ఏళ్ల కాలంలో జనాభా పెరుగుదల 4 లక్షలే ఉండటం ఏ మాత్రం సహేతుకంగా కనిపించదు. కనీసం 30 నుంచి 35 లక్షలైనా అదనంగా జనాభా పెరిగి ఉండాలి. 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో రాష్ట్ర జనాభా 3.68 కోట్లుగా నమోదైంది. దానికి పదేళ్ల తర్వాత నిర్వహించిన కులగణనలో అంతకూడా నమోదు కాకపోవటం విచిత్రంగానే ఉంటుంది. విలువైన దాన్ని లెక్కపెట్టలేని అశక్తతగానే దీన్ని చెప్పుకోవచ్చు. సర్వేలో పేర్కొన్న కులాల లెక్కల గురించి సర్వాంగీకారం ఎప్పటికీ రాదు. ఎంత పక్కాగా సర్వే చేసినప్పటికీ తమ సంఖ్యను తక్కువగా చూపించారనే స్వరాలు ఎప్పుడూ వినపడుతూనే ఉంటాయి. కుల జనాభా సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగాల్లో, విద్యా సంస్థల్లో, రాజకీయ పదవుల్లో ప్రాతినిధ్యం ఉండాలనే డిమాండ్లు ఉన్న చోట ఇవి తప్పవు. ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలంటే ఎక్కువ జనాభా ఉండాలి. అందుకే వివిధ కారణాల వల్ల జనాభా తగ్గినా దాన్ని ఒప్పుకొనే పరిస్థితిలో కులసంఘాలు ఉండవు. తెలంగాణలో రెడ్డి, వెలమ కులాలకు కొన్ని నియోజకవర్గాల్లో గణనీయంగా సంఖ్యరీత్యా కూడా పట్టు ఉందని ఇప్పటివరకూ చాలా అంచనాలు ఉన్నాయి. ఈ రెండు కులాలు రాజకీయంగా నిర్వహించిన పాత్రనూ ప్రదర్శించిన ప్రాబల్యాన్నీ దృష్టిలో ఉంచుకుని కొన్ని భావాలు బలంగా ఏర్పడ్డాయి. ఎప్పుడో ఏర్పడ్డ ఆ భావాలు ఇంకా బలంగానే ఉన్నాయి. కానీ కులగణనలో జిల్లాల వారీగా వెల్లడైన సమాచారాన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఈ రెండు కులాలు సంఖ్యరీత్యా స్వంత బలంమీద ఆధారపడి గణనీయంగా ఓట్లు తెచ్చుకునే పరిస్థితి ఉన్న నియోజకవర్గాలను వేళ్ల మీదే లెక్క పెట్టొచ్చు. ఇతర కులాల సహకారం, మద్దతు లేకుండా పదోవంతు ఓట్లను తెచ్చుకునే పరిస్థితి లేదు. ఒక కులానికి కనీసం 30 శాతం వరకూ ఓట్లుండే నియోజకవర్గం ఉంటే దాన్ని ఆ కులానికి బాగా పట్టున్న ప్రాంతంగా భావించొచ్చు. నియోజకవర్గాలవారీ కులాల సమాచారం ప్రస్తుతానికి వెల్లడి కాలేదు. కులగణనకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన నాలుగు సంపుటాల్లో జిల్లాలవారీ సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది. గ్రేటర్ హైదరాబాద్ (23,719), కరీంనగర్ (11,373) మినహా ఎక్కడా వెలమల సంఖ్య 10 వేలకు దాటలేదు. అయిదు వేల నుంచి పదివేల లోపు వెలమ జనాభా ఉన్న జిల్లాలు తొమ్మిది ఉన్నాయి. మిగతా చోట్ల మరీ తక్కువ. జనాభాలో ఓటర్లను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే వారి సంఖ్య ఇంకా తగ్గిపోతుంది.

# విశాఖ జనసేన పార్టీ కార్యాలయంలో గౌరవ సీఎం, నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు

- కూటమి శ్రేణుల సమక్షంలో కేక్ కటింగ్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్
- పబ్లిక్ గ్రీవెన్స్‌లో పలువురి నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే - సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 41వ వార్డు ప్రాంతవాసి కమల్ కుమార్‌కి రెండు లక్షల చెక్కును అందజేసిన ఎమ్మెల్యే









**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్ వన్‌గా అభివృద్ధి చేయడానికి అహర్నిశలు శ్రమిస్తున్న స్వర్ణాంధ్ర స్వాప్నికుడు గౌరవనీయులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ జనసేన పార్టీ నగర కార్యాలయంలో సోమ వారం సాయంత్రం కేక్ కట్ చేశారు. అనంతరం వంశీ కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధిలోనూ సం క్షేమ పథకాల అమలులోనూ దేశంలోనే ముందు వరసలో నిల బెట్టారని ప్రశంసించారు. అనంతరం పార్టీ ఆఫీసులో నిర్వహిం చిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరించారు. పలు సమస్యలు పరిష్కారం చేయగా, మిగిలినవి సంబంధిత అధికారులకు తెలియపరచి వెంటనే పరిష్కారం చేయాలని తెలిపారు. తదుపరి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును 41 వార్డుకు చెందిన కోర్లపు కమల్ కుమార్‌కి రూ, 2,00,000/- లను అందచేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రెహమాన్, సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, కూటమి పార్టీ నేతలు కొనడ చిన్న, విల్లూరి చక్రవర్తి, అక్కిరెడ్డి జగదీశ్, నాని, లెంక త్రినాథ్, ఆగంటి శ్రవణ్ కుమార్, మణి, గరికిన రవి, పడమటి శ్రీను, మచ్చ రాజు, ఆంథోనీ శేఖర్, పిల్లి. గోవింద్, మరియు కూటమి నాయకులు, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భీమిలిలో రెండు ప్రాంతాలలో చోరీ





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భీమిలి ప్రాంతంలో గత కొంతకాలంగా మేకలు, గొర్రెలు దొంగతనం జరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో భీమిలి జీవీఎంసీ రెండవ వార్డు ఇండోర్ స్టేడియం గొల్లల పాలెం గ్రామంలో గృహాలు వద్ద కట్టిన మేకలను శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి దొంగతనం చేశారు. దీనిని గమనించిన స్థానికులు కేకలు వెయ్యడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయేందుకు ప్రయత్నం చేశారు. దీంతో స్థానికులు చాకచక్యంగా వారిని వెంబడించి ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. ఈ క్రమంలో ఓ దొంగ క్రిందకు పడడంతో చెయ్యికి స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం దొంగలు ఇద్దరిని భీమిలి పోలీసులకు అప్పగించారు.

**సాయిబాబా గుడిలో చోరీ**

భీమిలి జీవీఎంసీ 3వ వార్డు తోటవీధి, భీమిలి లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న సాయిబాబా గుడిలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది.

ఓ వ్యక్తి ముసుకు దుస్తులు ధరించి గుడిలోకి ప్రవేశించాడు. అక్కడ ఉన్న హుండీని పగలగొట్టి అందులో ఉన్న నగదును దొంగలించి వెళ్ళిపోయారు. ఇదంతా అక్కడ ఉన్న సీసీ కెమెరాలో రికార్డు అయింది.గుడి తలుపులు తీసిన అర్చకుడు దీనిని గమనించిన భీమిలి క్రైమ్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు...మెగా రక్తదాన శిబిరం





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అభివృద్ధి, సంక్షేమాన్ని సమతుల్యంగా నడిపిస్తూ ప్రజల జీవితంలో మార్పు తీసుకొచ్చిన విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు అని పెద్దాపురం శాసన సభ్యులు నిమ్మకాయ చినరాజప్ప పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సామర్లకోట మండలం అచ్చంపేట కాపు కళ్యాణ మండపంలో జన్మదిన వేడుక లను నిర్వహించారు. దానిలో భాగంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా నియోజక వర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా టిడిపి పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, తెదేపా నేతలతో కలిసి భారీ కేక్ కటింగ్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. రక్తం దానం చేసిన నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే రాజప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్ర మంలో నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, రాజా సూరిబాబు రాజు, కంటే జగదీష్ మోహన్, యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, బలుసు వాసు, వల్లూరి దొరబాబు, నిమ్మకాయల కిరణ్ కుమార్, అందుగుల జార్జి చక్రవర్తి, నూనె రామారావు, రామాలక్ష్మి, నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదవాడి ఆకలి తీర్చడమే చంద్రన్న లక్ష్యం

- రాష్ట్ర వ్యాప్తంగా అన్నా క్యాంటీన్లలో అన్నదానానికి నిధులు సమకూర్చిన నారా భువనేశ్వరి - సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం...అన్న క్యాంటీన్ వద్ద వడ్డించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, (రాజధాని వార్తలు):** నవ్యాంధ్ర నిర్మాత, అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు అమలాపురంలో ఘనంగా నిర్వహించారు. అమలాపురంలోని అన్నా క్యాంటీన్ వద్ద ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని అన్నా క్యాంటీన్లలో సోమవారం జరుగుతున్న అన్నదాన కార్యక్రమానికి అయ్యే ఖర్చును చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి భరించడం వారి సేవా నిరతికి నిదర్శనమని ఎమ్మెల్యే కొనియాడారు. పేదవాడి ఆకలి తీర్చడమే లక్ష్యంగా చంద్రన్న ప్రారంభించిన ఈ అన్నా క్యాంటీన్లు నేడు లక్షలాది మందికి ఆసరాగా నిలుస్తున్నాయని అన్నారు. విలాసాలకు దూరంగా పేద ప్రజలకు సేవా కార్యక్రమాలతో చంద్రబాబు పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అమలాపురం నియోజక వర్గంలో వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని అన్నారు. ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నా క్యాంటీన్లు నిరుపేదలకు కూలీలకు వర ప్రసాదంగా నిలిచాయని అన్నారు. చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా అన్నా క్యాంటీన్ వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఎమ్మెల్యే ఆనందరావు స్వయంగా వడ్డించి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అన్న క్యాంటీన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

- అక్రమ నిల్వలపై మెరుపు దాడులు..భారీ స్టాక్ సీజ్: జిల్లా పౌరసరఫరాల అధికారి ఉదయ భాస్కర్



**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రేషన్ బియ్యాన్ని అక్ర మంగా నిల్వ ఉంచి రీ-సైక్లింగ్ చేసి ఎగుమతి చేస్తు న్నారన్న పక్కా సమాచారంతో కోనసీమ జిల్లా సరఫరా అధికారి నేతృత్వంలోని బృందం పలు దాడులు, తనిఖీలు నిర్వహించారు. రామచంద్రపురం డిప్యూటీ తహసీల్దార్, విలేజ్ రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం శ్రీ సాయి మణికంఠ ట్రేడర్స్ రైస్ మిల్లుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారన్నారు. అధికారులు మిల్లుకు చేరుకున్న సమయంలో మిల్లు యజమాని ప్రాంగణానికి తాళాలు వేసి పరారయ్యారన్నారు. వెంటనే స్పందించిన అధికారులు యజమానిని అదుపులోకి తీసుకుని మిల్లు తలుపులు తీయించి సోదాలు నిర్వహించారన్నారు. ఈ తనిఖీల్లో భారీ ఎత్తున పి.డి.ఎస్ బియ్యం నిల్వలను గుర్తించారు. టెక్నికల్ స్టాఫ్ సభ్యుడు సత్యరాజ్ తన కిట్ ద్వారా రసాయన పరీక్షలు నిర్వహించి బియ్యంలో ఫోర్టి ఫైడ్ రైస్ కెర్నల్స్ ఉన్నట్లు ధృవీకరించారన్నారు. పట్టుబడిన రైస్ ప్రభుత్వ రేషన్ బియ్యమేనని నిర్ధారణ అయ్యిందన్నారు. పిడిఎఫ్ బియ్యం 60 మెట్రిక్ టన్నులు, నూకలు 100 మెట్రిక్ టన్నులు, బాయిల్డ్ రైస్ 4 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందని దీని విలువ సుమారుగా రూ. 55 లక్షలు ఉంటుందన్నారు. మిల్లు యజమాని దొరబాబు, అకౌంటెంట్ సోరంపూడి రాజులను విచారించగా పేద ప్రజల నుండి కేజీ రూ.23 చొప్పున రేషన్ బియ్యాన్ని సేకరించి సోర్టెక్స్ మిషన్ ద్వారా శుద్ధి చేసి "సీలోని అనే బ్రాండ్ పేరుతో సంచులలో నింపి కాకినాడ పోర్టు ద్వారా కేజీ రూ.28 లకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు అంగీకరించారన్నారు. సీజ్ చేసిన సరుకు విలువ రూ.50 లక్షలు దాటిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ కోర్టులో సెక్షన్ 6 ఎ కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అక్రమ కొనుగోళ్లు, బ్లాక్ మార్కె టింగ్‌కు పాల్పడిన నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని అధికారులు తెలిపారు. ప్రభుత్వ బియ్యాన్ని అక్రమంగా తరలిం చినా లేదా నిల్వ ఉంచినా కఠిన చర్యలు తప్పవని ఉదయ భాస్కర్ హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా కొనసాగుతుందని ఉదయ భాస్కర్ అన్నారు.

# రెడ్ హాట్ పాలక్ బ్యూటీ



బాలీవుడ్‌లో సహాయ దర్శకురాలిగా కెరీర్‌ను ప్రారంభించిన ముద్దుగుమ్మ పాలక్ తివారీ. ఈ అమ్మడు తక్కువ సమయంలోనే బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించింది. అంతిమ్ సినిమాకు సహాయ దర్శకురాలిగా వర్క్ చేస్తున్న సమయంలోనే ఈమెలో నటిని గమనించిన కొందరు ఆ దిశగా ప్రయత్నాలు చేయమని సలహా ఇచ్చారట. దాంతో ఈ అమ్మడు మెల్లగా మోడలింగ్, యాక్టింగ్ వైపు మళ్లింది. తక్కువ సమయంలోనే బాలీవుడ్‌లో సినిమాల్లో ఆఫర్లు దక్కించుకుంది. మోడలింగ్‌లోనూ దూసుకు పోతుంది. చాలా తక్కువ సమయంలో సోషల్ మీడియాలో మంచి పాపులారిటీని ఈ అమ్మడు దక్కించుకుంది. హీరోయిన్స్‌కి ఏ స్థాయిలో ఇన్‌స్టాలో ఫాలోవర్స్ ఉంటారో ఆ స్థాయిలో ఈ అమ్మడికి ఫాలోవర్స్ ఉన్నారు అంటే ఈమె ప్రతిభ, అందం ఏంటో అర్థం చేసుకోవచ్చు. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఈ అమ్మడు ట్రెండ్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. ఇండస్ట్రీలో ఉన్న సంబంధాల కారణంగా సహాయ దర్శకురాలిగా ఎంట్రీ ఇచ్చిన పాలక్ తివారీ 2023లో సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన కిసీ కా భాయ్ కిసీకి జాన్ సినిమాలో కీలక పాత్రలో కనిపించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత బిజ్లీ బిజ్లీ అనే మ్యూజిక్ వీడియోను చేయడం ద్వారా మరింతగా సోషల్ మీడియాలో పాపులారిటీని సొంతం చేసుకుంది. ఇక రోసీ సినిమాలో నటించిన ఈమెకు నటిగా మరింత మంచి మార్కులు దక్కాయి. సోలో హీరోయిన్‌గా సినిమాలు చేయడం కోసం వెయిట్ చేస్తున్న ఈ అమ్మడు మరో వైపు మోడలింగ్ చేస్తూ, ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా ఫోటోలను, వీడియోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతున్న విషయం తెల్సిందే. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపుగా 50 లక్షల మంది ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న పాలక్ తాజాగా మరో అందాల ఆరబోత ఫోటో షూట్ ను చేయడం ద్వారా వార్తల్లో నిలిచింది. సాధారణంగా ముద్దుగుమ్మలు రెడ్ డ్రెస్‌లో కన్నుల విందు చేయడం మనం చూస్తూ ఉంటాం.

ఇక పాలక్ తివారీ అంతకు మించి అన్న ట్లుగా అందాల ఆరబోత చేయడం ద్వారా కన్నుల పండుగ అన్నట్లుగా ఉంది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ పాలక్ తివారీ సొంతం. అందుకే ఈ రెడ్ డ్రెస్‌లో అంతకు మించి అన్నట్లుగా అందంగా, ఆకర్షణీయంగా పాలక్ కనిపిస్తోందని నెటిజన్స్, ముఖ్యంగా ఆమె ఫాలోవర్స్ కామెంట్స్ చేస్తున్నారు. గతంలోనూ పాలక్ అందాల ఆరబోత ఫోటోలు, మోడలింగ్ ఫోటోలను షేర్ చేసింది. అయితే ఈ స్థాయిలో ఆ ఫోటోలు అందంగా కనిపించలేదని, ఈసారి రెడ్ హాట్ అన్నట్లుగా అనిపిస్తోంది అంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న ఈ అమ్మడికి ఎందుకు బాలీవుడ్ నుంచి బల్క్ ఆఫర్లు రావడం లేదు అంటూ కొందరు విచారం వ్యక్తం చేస్తున్నారు.

# ‘రాకా’ మ్యూజిక్‌కు వరల్డ్‌వైడ్ క్రేజ్.. సాయి అభ్యంకర్ క్లారిటీ!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న ‘రాకా’ సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. తాజాగా ఈ సినిమా మ్యూజిక్ గురించి సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఇచ్చిన అప్‌డేట్స్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారాయి. ఇంటర్నేషనల్ లెవల్‌లో సాంగ్స్ ఉండబోతున్నాయని, విదేశీ సింగర్స్ కూడా ఇందులో భాగం అవుతున్నారని ఆయన చెప్పడంతో ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు. బన్నీ స్టైల్‌కు తగ్గట్టుగా మ్యూజిక్ అదిరిపోబోతోందని క్లారిటీ వచ్చేసింది. ఆ వివరాలు ఇలా వున్నాయి.. సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ ఈ సినిమా మ్యూజిక్ వర్క్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అట్లీతో జరిగిన మొదటి మీటింగ్‌లోనే సాంగ్స్ ఎలా ఉండాలో ఆయనకు ఒక క్లియర్ విజన్ ఉందని సాయి తెలిపారు. ఇక అల్లు అర్జున్ మ్యూజిక్ టేస్ట్ గురించి మనందరికీ తెలిసిందే. బన్నీకి సంగీతంపై ఉన్న పట్టు, ఆయన ఇష్టాఇష్టాలు ఈ సినిమా ఆల్బమ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్తున్నాయని సాయి చెప్పారు. వీరిద్దరి అభిరుచికి తగ్గట్టుగా సాంగ్స్ చాలా పవర్‌ఫుల్‌గా వస్తున్నాయని సమాచారం.

# పూరి రెండున్నర దశాబ్దాల ప్రయాణం!



తెలుగు సినీ పరిశ్రమలో మాస్ అనే పదానికి సరికొత్త నిర్వచనం పరిచయం చేసిన దర్శకుడు పూరి జగన్నాథ్. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చి అదే పరిశ్రమలో తానో బ్రాండ్‌గా ఎదిగారు. తన కలం బలంతో దర్శకుల్లో స్టార్ హీరోల ఇమేజ్‌నే మార్చేసిన ఓ కొత్త తరం దర్శకుడాయన. సిటీకి ఎంతో మంది కమీషనర్లు వస్తుంటారు... పోతుంటారు. కానీ చంటిగాడు లోకల్ అన్న డైలాగ్ లా –పరిశ్రమకు ఎంతో మంది దర్శకులు వస్తుంటారు. పోతుంటారు. కానీ పూరి అనేవాడు ఓ బ్రాండ్ అంటూ తన డైలాగ్ నే తన ఐడెంటీగా మార్చేసుకున్నాడు. హీరో క్యారెక్టరైజేషన్‌లో పూరి చూపించే వైవిధ్యం, రాసే పవర్ ఫుల్ డైలాగ్స్ పూరిని ఒక ట్రెండ్ సెట్టర్‌గా నిలబెట్టాయి. పూరి పరిశ్రమలోకి అడుగు పెట్టి నేటితో 26 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. పూరి కెరీర్ ప్రారంభంలోనే బద్రి వంటి సంచలన విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్‌ను మలుపు తిప్పారు. అటుపై రిలీజ్ అయిన ఇట్లు శ్రావణి సుబ్రమణ్యం, ఈ అమ్మాయి చాలా మంచివాడు వంటి చిత్రాలు ఆయనలోని సున్నితమైన భావోద్వేగాలను ఆవిష్కరించాయి. అయితే ఇడియట్ సినిమాతో పూరి జగన్నాథ్ టాలీవుడ్ ముఖచిత్రాన్నే మార్చేశారు. అప్పటి వరకు ఉన్న పద్ధతి గల హీరో పాత్రలను పక్కన బెట్టి పోకిరి తత్వమున్న హీరోని పరిచయం చేసి యువతలో ఓ ఊపు తెచ్చారు. పూరి కెరీర్‌లో పోకిరి ఓ మైలురాయి. ఆ సినిమాతో మహేష్‌ను మాస్ ప్రేక్షకులకు దగ్గర చేయడమే కాదు. అప్పటి వరకూ ఉన్న ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసిన చిత్రమది. మహేష్‌ని వంద కోట్ల క్లబ్లో చేర్చిన చిత్రమది. ఈ చిత్రంతో పూరి జగన్నాథ్ ఇమేజ్‌ను తెచ్చుకున్నారు. స్టార్ హీరోలెవరైనా సరే తమలోని మాస్ కోణాన్ని బయటకు తీయాలంటే పూరి దగ్గరకు వెళ్లాల్సిందే అనే పరిస్థితిని సృష్టించారు. రవితేజను మాస్ మహారాజాగా మార్చడంలో, అల్లు అర్జున్‌ను దేశముదురుగా చూపించడంలో విజన్ స్పష్టంగా కనిపిస్తుంది. అమ్మ నాన్న ఓ తమిళ అమ్మాయి, శివమణి, చిరుత, టెంపర్, ఇస్మార్ట్ శంకర్ ఇలా ఎన్నో విజయాలు పూరి చూసాడు. బిజినెస్ మ్యాన్ చిత్రం పూరికి జాతీయ స్థాయిలో ప్రత్యేకమైన గౌరవాన్ని, గుర్తింపును తెచ్చి పెట్టాయి. పూరి ట్యాలెంట్ చూసే బిగ్ బీ అమితాచ్చన్ సైతం ఓ అవకాశం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఏ క్రియేటర్ జీవితంలోనైనా ఎత్తుపల్లాలు సహజం. పూరి జగన్నాథ్ కూడా వరుస అపజయాలను ఎదుర్కొన్నారు. ఒక దశలో ఆయన తీసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. కథల విషయంలో మొరటుతనం పెరిగిందనే విమర్శలు ఎదుర్కున్నారు. భారీ అంచనాలతో వచ్చిన ఆంధ్రావాలా, పైసా వసూల్, లైగర్ సహా పలు సినిమాలు డిజాస్టర్‌గా నిలవడం పూరి కెరీర్‌ను కొంత ఇబ్బందుల్లో నెట్టింది. కానీ ఓటమిని అంగీకరిస్తూనే మళ్ళీ పుంజుకోవడం పూరి శైలి. పూరి జగన్నాథ్ దర్శకుడే కాదు. మంచి ఫిలాసఫర్ కూడా. ఆయన సినిమాల్లోని పాత్రలు సమాజానికి భిన్నంగా ఆలోచిస్తాయి. పూరి ముసింగ్స్ పేరుతో ఆయన పంచుకునే ఆలోచనలు నేటి యువతను బాగా ఆకర్షిస్తున్నాయి. జీవితాన్ని, విజయాన్ని, అపజయాన్ని సమానంగా స్వీకరించే ఆయన వ్యక్తిత్వం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తనదైన శైలిలో సినిమాలు తీస్తూ వెండితెరపై నేటికి ఉనికిని చాటుకుంటూనే ఉన్నారు. మొత్తంగా పూరి జగన్నాథ్ 26 ఏళ్ల ప్రయాణం ఓ అద్భుతమైన పాఠం. టాలీవుడ్‌కి ఎందరో దర్శకులు వస్తుంటారు. వెళుతుంటారు.

కానీ పూరి జగన్నాథ్ సృష్టించిన మ్యానరిజమ్స్, డైలాగ్స్ ఎప్పటికీ గుర్తుండిపోతాయి. పూరి మళ్ళీ బలమైన కథతో బాక్సాఫీస్ సత్తాను చాటాలని అభిమానులు కోరుకుంటున్నారు. తెలుగు సినిమా చరిత్రలో పూరి పేరు సంచలనంగానే నిలిచిపోతుంది. ప్రస్తుతం మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతితో హీరోగా పూరి స్లమ్ డాగ్ 33 టెంపుల్ రోడ్ అనే సినిమా చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

# అందాల డోస్ పెంచిన శ్రీలీల.. ఫ్యాన్స్ ఫిదా!



టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల లేటెస్ట్ ఫోటోషూట్‌తో నెటిజన్ల మనసు గెలుచుకుంది. ‘ఉస్తాద్ భగత్ సింగ్’ ప్రమోషన్ల కోసం ఆమె ధరించిన బేజ్ కలర్ అనార్కలీ డ్రెస్‌లో దేవకన్యలా మెరిసిపోతోంది. మృణాళిని రావు డిజైన్ చేసిన ఈ అవుట్‌ఫిట్‌లో శ్రీలీల లుక్ చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొద్ది గంటల్లోనే లక్షలాది లైకులతో ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. కేవలం డాన్స్‌తోనే కాదు, తన క్లాసీ లుక్స్‌తోనూ ఆమె మ్యాజిక్ చేస్తోంది. శ్రీలీల తాజా ఫోటోషూట్ చూస్తుంటే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. మృణాళిని రావు కలెక్షన్ నుంచి ఎంచుకున్న ‘వల్లి అనార్కలీ’ సెట్‌లో ఆమె చాలా ఎలిగెంట్‌గా కనిపిస్తోంది. సిల్క్ ఫ్యాబ్రిక్‌తో చేసిన ఈ డ్రెస్‌పై ఉన్న హ్యాండ్ ఎంబ్రాయిడరీ వర్క్ ఆమె అందాన్ని మరింత పెంచింది. దీనికి తోడు ‘బిడాజిల్స్’ అందించిన జువెలరీ పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యింది. గ్లామర్ షోకు దూరంగా, ఇలాంటి సంప్రదాయ దుస్తుల్లో కూడా శ్రీలీల ఎంత గ్రేస్‌ఫుల్‌గా ఉండగలదో ఈ ఫోటోలు నిరూపిస్తున్నాయి. శ్రీలీల కేవలం అందానికే పరిమితం కాకుండా, వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ ఏడాది పవన్ కళ్యాణ్ సరసన నటించిన ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమాతో ప్రేక్షకులను అలరించింది. అలాగే శివకార్తికేయన్ హీరోగా వచ్చిన ‘పరాశక్తి’ సినిమాలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇక 1960ల నాటి రాజకీయ నేపథ్యంలో సాగే ఆ చిత్రంలో శ్రీలీల తన చలాకీతనంతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ రెండు సినిమాలు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ రికార్డు వ్యూస్ సాధిస్తుండటం విశేషం. టాలీవుడ్‌లో అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ స్టేటస్‌ను దక్కించుకుంది శ్రీలీల. స్టార్ హీరోలందరి సరసన వరుస ఆఫర్లు కొట్టేస్తూ దూసుకుపోతోంది. ఆమెలో ఉన్న ఎనర్జిటిక్ డాన్స్, చలాకీతనం చూసి మేకర్స్ సర్‌ప్రైజ్ అవుతున్నారు. గ్లామర్ పాత్రలైనా, నటనకు ప్రాధాన్యం ఉన్న రోల్స్ అయినా తనదైన స్టైల్‌లో న్యాయం చేస్తోంది. ఇక అందుకే ఇప్పుడు సోషల్ మీడియాలో ఆమె పెట్టిన ఫోటోలకు కేవలం 10 గంటల్లోనే దాదాపు 2 లక్షల లైకులు రావడం చూస్తుంటే ఆమె క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. మొత్తానికి శ్రీలీల తన అందం, అభినయంతో ఆడియెన్స్‌ను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. అటు సినిమాలతో, ఇటు సోషల్ మీడియా ఫోటోషూట్లతో నిరంతరం వార్తల్లో నిలుస్తోంది. గ్లామర్ డోస్ పెంచినా అది క్లాసీగా ఉండేలా చూసుకోవడం ఆమె ప్రత్యేకత. ఇదే జోరు కొనసాగిస్తే రాబోయే రోజుల్లో టాలీవుడ్ నెంబర్ వన్ హీరోయిన్‌గా శ్రీలీల నిలవడం ఖాయమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. శ్రీలీల కెరీర్ ఇలాగే సక్సెస్‌ఫుల్‌గా సాగాలని మనమూ కోరుకుందాం!

# సీతంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఐదు రోజుల ఎఫ్‌డిపి పోస్టర్ విడుదల



**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరంలోని సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (సీతం) ఆధ్వ ర్యంలో, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ & డేటా సైన్స్) విభాగం ద్వారా ఐదు రోజుల ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి)ను నిర్వహిం చనున్నట్లు సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశి భూషణ రావు, ప్రిన్సిపాల్ డా.డి.వి.వి.రామ్మూర్తి మరియు విభాగాధిపతులు ఈరోజు అధికారికంగా పోస్టర్‌ను విడుదల చేశారు. "క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీస్‌లో ఎదుగుతున్న ధోరణులు" అనే అం శంపై ఈ కార్యక్రమం మే 11 నుండి మే 15, 2026 వరకు ప్రతిరోజూ ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఆన్‌లైన్‌లో జరుగుతుంది. ఈ కార్యక్ర మం ద్వారా ఫ్యాకల్టీ సభ్యులు మరియు పరిశోధకులు క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో తాజా పరిణామాలు, సాంకేతికతలు మరియు భవిష్యత్ అవకాశాలపై అవగాహన పొందగలరని నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రముఖ నిపుణులు, అకాడమిక్ రంగంలోని ప్రఖ్యాతులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఉపన్యాసాలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆసక్తి గల ఫ్యాకల్టీ సభ్యులు ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఈ పోస్టర్ విడుదల కార్యక్రమంలో కళాశాల ఉన్నతాధికారులు, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి



**పాచిపెంట, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ యొక్క వేడుకల్లో మంత్రి సంధ్యా రాణితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి ముఖ్యమంత్రికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న నాయకుడు అని కొనియాడారు."76 ఏళ్ల వయస్సులో కూడా నవ యువ కుడిలా నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్న నాయకుడు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు" రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం అనే ధ్యేయాలతో ఆయన నిరంతరం ముందుకు సాగుతున్నారని మంత్రి తెలిపారు. అలాంటి దూరదృష్టి గల నాయకుడి నాయక త్వంలో పని మంత్రిగా పని చేయడం తనకు ఎంతో గర్వకారణం అని మంత్రివర్యులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎవరూ ఆకలితో అలమటించకూడదనే గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గొప్ప దూరదృష్టికి "అన్న క్యాంటీన్" నిదర్శనం. ప్రతిరోజూ సుమారు 2.70 లక్షల మంది కేవలం రూ.5కే భోజ నం పొందుతూ పేదలకు ఆహార భద్రతను అందిస్తున్నారు. అలాగే ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. సాలూరు నియోజకవర్గానికి రూ.1 కోటి 50 లక్షలు మంజూరు చేసి ప్రజలకు అండగా నిలిచారని మంత్రి పేర్కొన్నారు. తదనంతరం పారమ్మ కొండ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రివర్యులు.

# వేసవిలో తాగునీటి సమస్య ఉండరాదు

## - ఇప్పటికే పటిష్ట చర్యలు.. మరింత శ్రద్ధ తీసుకోవాలని హితవు : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** వేసవిని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే తాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, మరింత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హితవు పలికారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎక్కడైనా పైపులైన్లు లేదా మోటార్లు మరమ్మతులకు గురైతే, వెంటనే స్పందించి పరిష్కరించాలని, అవసరమైన మెటీరియల్‌ను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. హర్ ఘర్ జల్' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే ప్రక్రియను వేగవం తం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. కొన్ని చోట్ల పైపు లైన్లు వేసినా కుళాయిలు ఇవ్వలేదని, మరికొన్ని చోట్ల ట్యాంకులు నిర్మించినా బోర్ల సౌకర్యం లేదని గుర్తించామని, వీటిని వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆన్-గోయింగ్ పనులన్నింటినీ మార్చి 2027 లోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేయా లని అధికారులను ఆదేశించారు. ట్యాంకులను 2028 వరకు గడువు ఉన్నప్పటికీ, ఈలోగా పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్.దిలీప్ చక్రవర్తి, గ్రామీణ నీటిసరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్, ఇతర అధికా రులు తదితరులు పాల్గొన్నారు.

# వేమిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ మహిళా నేత కొమారి విజయమ్మ దంపతులు



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమి రెడ్డి ప్రభాకర్ రెడ్డికి హార్దిక జన్మదినం సందర్భంగా శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి సభ్యురాలు కొమారి విజయమ్మ, కొమారి వేణుగోపాల్ దంపతులు శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భం గా విజయమ్మ మాట్లాడుతూ విపిఆర్‌లాంటి మహాదాతలు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఇలాంటి జన్మదినములు భవిష్యత్తులో మరెన్నో జరుపుకొని సేవా కార్యక్రమాలు చేయాలని 3వ డివిజన్ తెలుగు దేశం పార్టీ అధ్యక్షు లు మరియు శ్రీకాళహస్తీశ్వర ఆలయ పాలక మండలి సభ్యులు కొమారి విజయమ్మ, టీడీపీ నేతలు వేణుగో పాల్‌లు వేమిరెడ్డి నివాసములో కలిసి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. అదేవిదంగా ఏపీని పాలిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు.

# ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

## - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వానికి వతిరేక విధానాలను తిప్పికొట్టాలి : ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య





**విజయనగరం, (రాజధాని వార్తలు):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని, కార్మి కులపై దాడుల ఆపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య అన్నారు. సోమవారం ఏఐటీయూసీ 12వ జిల్లా మహాసభలను నిర్వహించారు. ముందుగా పట్టణంలో స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నుండి కన్యకా పరమేశ్వరి కోవెల మీదుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వరకు వివిధ కళాబృందాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు అనంతరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు అధ్యక్షతన నిర్వహించిన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్ కంపెనీలైన అంబానీ ఆదాని ఆస్తులు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయిన్నారు. 3వ సారి అధికారం లోకి వచ్చిన నరేంద్ర మోడీ, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మికు లను బానిసలుగా మారటానికి 44 చట్టాలను 4 లేబర్ కోడ్లుగా కుదించి అత్యంత వేగంగా అమలు చేసే ప్రయత్నం చేస్తుందని, కార్మిక వ్యతిరేక కోడ్ల ఉపసంహరణకు పోరాటాలు ఉధృతం చేయాల్సి అవసరం ఉందన్నారు. గ్రామాలలో వ్యసాయ కార్మికుల వలసలను రూపుమాపాలనే లక్ష్యంతో చట్టసభల్లో సిపిఐ, వామ పక్షవాదులు ఆనాటి ప్రభుత్వంతో పోరాడి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆ చట్టాన్ని వి.బి.జి. రామ్.జి పథకంగా మార్పుచేసింది. ఇది అత్యంత దారుణం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26 27 28 తేదీలలో తిరుపతిలో జరిగే రాష్ట్ర మహాసభలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులంతా హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల కోసం ఏఐటీ యూసీ 106 సంవత్సరాలుగా పోరాటాలు చేస్తూనే ఉన్నాయ న్నారు. కేంద్రంలో 12 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ కార్మికులకు ఏమి చేసిందో చెప్పాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో కార్మికుల కోసం కీలక పాత్ర ఏఐటియుసి పోషించిందన్నారు.

దేశంలోనే కాకుండా రాష్ట్రంలో కార్మికుల పక్షాన ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉందన్నారు సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడుతూ ఏఐటీయూసీ చేసే పోరాటాలకు ఎన్నడు సిపిఐ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, మధ్యాహ్న భోజన పథక కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె స్రవంతి, తదితర నేతలు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటిన్లు పేదల ఆకలి తీర్చే అక్షయ పాత్రలు : రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్






**గజపతినగరం, (రాజధాని వార్తలు):** అన్నా క్యాంటిన్లు పేదల ఆకలి తీర్చే అక్షయపాత్రలు అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరి శ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమ వారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76వ పుట్టిన రోజు సందర్భంగా నియోజకవర్గ కేంద్రం గజపతినగరంలో నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం లో మంత్రి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు, చిన్న చిన్న పనులు చేసుకునే వారెవరు ఆకలితో ఉండకూడదనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నా క్యాంటిన్లతో వారి కడుపు నింపే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఒక్కరికి అల్పహారం పంపిణీ చేయడంతో పాటు ఆయన కూడా స్వయంగా అల్పాహారం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, ఏఎంసీ చైర్మన్ పి వి గోపాలరాజు, నియోజకవర్గంలోని నాలుగు మండల పార్టీల అధ్యక్షులు, ముఖ్యనేతలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పీఎం-రాహత్ ద్వారా రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు రూ. 1.5 లక్షల నగదు రహిత వైద్యం

## - 'గోల్డెన్' అవర్‌లో చికిత్స ద్వారా బాధితుల ప్రాణాలకు భరోసా - డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా పీఎం-రాహత్ పథకం అమలు : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, (రాజధాని వార్తలు):** రోడ్డు ప్రమాదాల క్షతగాత్రు లకు ఉచిత తక్షణ వైద్యం సహాయం అందించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం-రాహత్ పథకాన్ని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం-రాహత్ పథకం పోస్టర్ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు 'గోల్డెన్' అవర్లో రూ.1.5 లక్షల వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ఉ ద్దేశించిన పీఎం-రాహత్ పథకాన్ని జిల్లా లో ట్రస్టు అనుబంధ గుర్తింపు పొంది ఆర్థో, పాలీట్రామా సేవలు అందుబాటులో ఉ న్న 23 ప్రభుత్వాసుపత్రుల్లో అమలు చేస్తున్నామని ప్రకటించారు. పీఎం-రాహత్ పథకం అమలు కోసం ట్రస్టు కార్యాలయంలో ఓ ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాద బాధితుల ఆర్థిక పరిస్థితులు, స్థానికతతో సంబంధం లేకుండా ఎవరికైనా సరే అసుపత్రుల్లో చేరినప్పుడు తక్షణ సాయం కింద ఏడు రోజులపాటు లేదా రూ.1.5 లక్షల విలువైన వైద్యాన్ని ఉచితంగా అసుపత్రులు అందిస్తాయని తెలిపారు. ఇన్ పేషెంట్ గా ఏడు రోజులు పాటు ఆసుపత్రిలో ఉండే అవకాశం ఉందని చెప్పారు. ఈ పథకం అమలులో ముఖ్యంగా 'గోల్డెన్ అవర్లో నగదు రహిత విధానంలో చికిత్స అందించడంవల్ల విలువైన ప్రాణాలు దక్కుతాయన్నారు. సత్వర చికిత్సతో త్వరగా క్షతగాత్రులు కోలుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేధు మాధవన్, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరాం, ఎన్ఐసి డిస్టిక్ మేనేజర్ ఎం.శ్రీధర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రాంబిల్లిలో 'రెన్యూ' పారిశ్రామిక ప్రాజెక్టు భూమి పూజకి ఈ నెల 23న ముఖ్యమంత్రి రాక

## - అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర







**రాంబిల్లి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరిన్ని భారీ పెట్టుబడులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి మరియు అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు కొల్లు రవీంద్ర తెలిపారు. సోమవారం మధ్యాహ్నం అనకాపల్లి జిల్లాలో యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలంలోని రెన్యూ సంస్థ ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు ఈ నెల 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా హాజరై భూమిపూజ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు స్థానిక యంత్రాంగం చేపట్టిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, జిల్లా ఏస్పీ తుహిన్ సిన్హా, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, స్థానిక శాసనసభ్యులు సుందరపు విజయకుమార్, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అలాగే వివిధ కార్పొరేషన్ల చైర్మన్లలతో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రి మాట్లాడుతూ ఈనెల 23 గురువారం ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాంబిల్లి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 20,000 మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగు నీరు, ఆహారం మరియు రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గతంలో రాష్ట్రం నుండి వెళ్ళిపోయిన కంపెనీలను తిరిగి రప్పించడమే కాకుండా, కొత్త పెట్టుబడులను ఆకర్షించడమే ఈ కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ లక్ష్యం మేరకు 20 లక్షల ఉద్యోగాల సృష్టిలో భాగంగా ఇటువంటి పారిశ్రామిక ప్రాజెక్టులు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన నేపథ్యంలో రాంబిల్లి సెజ్‌లో నిర్వహించనున్న రెన్యూ ఫోటోవోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి నిర్వహించే కార్యక్రమా నికి భారీగా ప్రజలు హాజరు అవుతారని భావించి తగిన పార్కింగ్, భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. సభా వేదిక, సాంస్కృతిక స్టేజ్, వీఐపీ, వీవీఐపీ గ్యాలరీలు, డెకరేషన్ తదితర ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల కోసం తాగు నీరు, పారిశుధ్యం, పబ్లిక్ టాయిలెట్లు, చెత్త సేకరణ వాహనాలు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. పబ్లిక్ పార్కింగ్ ప్రాంతాల్లో ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, రవాణా సౌక ర్యాలు సమకూర్చాలని, సిబ్బందికి అవసరమైన భోజన ఏర్పాట్లు ముందస్తుగా చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జిల్లాస్థాయి అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించాలి

## - పిజిఆర్ఎస్‌కు 131, రెవిన్యూ క్లినిక్ 123 : ఎస్.డి.సి, ఎస్.సుబ్బలక్ష్మి



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక పిజి ఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లలో వచ్చిన అర్జీలు నిర్ణిత సమయంలో పరిష్కరించాలని కె.ఆర్.ఆర్.సి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. సుబ్బలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరం 1, 2 లలో నిర్వహించిన పిజిఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలలో కెఆర్ఆర్సి, బిజెఆర్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎస్.విఎస్.సుబ్బలక్ష్మి, రామమణి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి జి.రామారావులు జిల్లాలోని వివిధ మండల, గ్రామాల నుండి ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్.డి.సి అధికారులను ఆదేశించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీలపై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని తెలిపారు. ఈ సందర్బంగా ఎస్.డి.సి సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను అర్జీదారునికి తెలియజేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకు గల కారణాలు వివరంగా తెలియజేయడం ద్వారా అర్జీలు రీ-ఓపెన్ కాకుండా నివారించవచ్చని ఆమె తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటన చేసి సమస్యలను పరిష్కరించాలని వివిధ శాఖల విభగాధిపతులకు సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో 131, రెవెన్యూ క్లినిక్ లో 123, మొత్తం 254 అర్జీలు స్వీకరించడం జరిగిందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మంగ వేణి, జిల్లా నైపుణ్యం అభివృద్ధి అధికారి గోవిందరావు, జిల్లా చేనేత అధికారి యస్వంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన ఆర్.రాము

**అచ్యుతాపురం, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా ఉన్న అచ్చుతాపురం ఎస్ఈజెడ్ బాధ్యులు ఆర్.రాము ఈనెల 17, 18, 19 తేదీల్లో నంద్యాలలో జరిగిన రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఎస్ఈజెడ్, బార్క్, ఫార్మాలో భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని, కనీస వేతనాలు పెంచాలని, ఈఎస్ఐ సేవలు కార్మికులకు ప్రభుత్వం అందజేయాలని, స్థానికులకు 75% ఉపాధి కల్పించాలని, పరిశ్రమ యాజమాన్యలు కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పాటించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలని ఈ మహాసభ తీర్మానం చేసిందని తెలిపారు.



# బ్యాంకర్లు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి సహకరించాలి

## - జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి అధ్యక్షతన బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించబడింది. జిల్లాలోని వివిధ బ్యాంకుల పనితీరు, రుణ ప్రణాళికలు మరియు ప్రభుత్వ ప్రాధాన్యత రంగాల పురోగతిపై ఈ సందర్భంగా సమగ్రంగా చర్చించారు. వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకులు సకాలంలో చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా వ్యవసాయం, విద్య మరియు స్వయం సహాయక సంఘాలకు అందించే రుణాల పంపిణీలో ఎటువంటి జాప్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ జీవనోపాధి పథకాల కింద ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకర్లు త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని, వారికి అవసరమైన ఆర్థిక తోడ్పాటును అందించాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజలకు కూడా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. బ్యాంక్ మేనేజర్లు ప్రతి వారం ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయించి, నేరుగా వినియోగదారుల సమస్యలను వినాలి. ప్రజలు తమ ఫిర్యాదులను సులభంగా తెలియజేయడానికి వాట్సాప్ నంబర్లను కూడా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. జిల్లా అభివృద్ధి పథంలో బ్యాంకర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు తమ సహకారాన్ని కొనసాగించాలని కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతిపురం సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సోమశేఖర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, నాబార్డ్ అధికారులు మరియు జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక"లో 55 వినతులు

## - జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణమూర్తి





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీలో అన్ని విభాగాలకు కలిపి 55 వినతులు వచ్చాయని జివిఎంసి అదనపు కమిషనరు డి.వి.రమణ మూర్తి తెలిపారు. సోమవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 55 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అం దులో ముఖ్యంగా భీమిలి జోన్‌కు 01, మధురవాడ జోన్‌కు 03, ఈస్ట్ జోన్‌కు 13, వెస్ట్ జోన్‌కు 04, నార్ట్ జోనుకు 08, సౌత్ జోన్‌కు 07, పెందుర్తి జోన్‌కు 05, గాజువాక జోన్‌కు 05, అనకాపల్లి జోన్ కు 01, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 08 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ & అకౌంట్సు విభాగమునకు 05, రెవెన్యూ విభాగమునకు 08, ప్రజారోగ్య విభాగమునకు 04, పట్టణ ప్రణాళిక విభాగమునకు 30, ఇంజినీరింగు విభాగమునకు 06, మొక్కల విభాగమునకు 02 కలిపి మొత్తంగా 55 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబం ధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, ప్రధాన ఇంజినీరు పివివి సత్యనారాయణ రాజు, ఎగ్జామినర్ ఆఫ్ ఎకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, ఆర్.ఎఫ్.ఒ కృపావరం, పర్యవేక్షక ఇంజనీర్లు, యుసిడి పి.ఒ పి.ప్రసన్న వాణి, డిపిఒ శాంతికుమారి, బయాలజిస్ట్ సాంబమూర్తి, ఎస్.ఒ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# లింగాయత్ సంప్రదాయాన్ని రూపొందించడంలో బసవేశ్వరుడు పాత్ర కీలకం : ఎస్.డి.సి, ఎస్.సుబ్బలక్ష్మి





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** లింగాయత్ సంప్రదాయాన్ని రూపొం దించడంలో బసవేశ్వరుడు కీలక పాత్ర పోసించారాని కె ఆర్ ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి ఎస్.సుబ్బలక్ష్మి పేర్కొ న్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో 895వ బసవేశ్వరుని జయంతి సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి ఎస్.సుబ్బలక్ష్మి బసవేశ్వరుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయ వాది మహాత్మ బసవేశ్వరునడని అన్నారు. హైందవ మతాన్ని సంస్కరించిన ప్రముఖులలో బసవేశ్వరుడు ఒక్కడు. ఇతనిని బసవన్న, బసవుడు, విశ్వ గురువుని పిలుస్తారు. అన్నమయ్య, వేమన, వీర బ్రహ్మం భావాలలో విప్లవాత్మక మార్పులు రావడానికి పరోక్షంగా బసవేశ్వరుని కారణమని తెలిపారు.

పాల్కురికి సోమనాథుడు రచించిన బసవ పురాణం తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమయ్యింది, దేవుడికి ప్రజలకు మధ్య పూజారులు అవసరం లేదు భక్తి కన్నా సత్ప్రవర్తనే ముఖ్యం అని చాటి చెప్పారన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే రీతిగా వచనాలు రాశాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి, సమన్వయ సూపరింటెండెంట్ విజయ్ కుమార్, వాసు నాయుడు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానసందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# ట్రాక్ నుంచి పార్లమెంట్ వరకు : భారత భవిష్యత్తుకు మహిళా నాయకత్వమే కీలకం

**విజయవాడ, (రాజధాని వార్తలు):** నేను నా జీవితమంతా పరుగులోనే గడిపాను – మొదట కేరళలోని మట్టి ట్రాక్లపై, ఆ తర్వాత ప్రపంచ వేదికపై, ఇప్పుడు ప్రజా జీవితంలో ప్రతి అడుగులోనూ కొన్ని స్పష్టమైన, మరికొన్ని చెప్పలేనటువంటి అడ్డంకులను ఎదుర్కొన్నాను; అవి మహిళలకు ఇక్కడ చోటు లేదని చెబుతుండేవి. ఆ అడ్డంకులు తొలగిపోతుంటే ఏమవుతుందో కూడా ప్రత్యక్షంగా చూశాను. అవకాశం ఫలితాలనునిస్తూ, మరీ ముఖ్యంగా, నమ్మకాన్ని మారుస్తుంది. అందుకే రాజ్యాంగ (128 సవరణ) బిల్లు, 2023–నారీ శక్తి వందన్ అధీనియం–కేవలం ఒక శాసనపరమైన మైలురాయి మాత్రమే కాదు. ఇది సుదీర్ఘ కాలం పాటు అమలులోకి రాని ఒక నిర్మాణాత్మక సవరణ. లోక్సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు మూడో వంతు సీట్లను కేటాయించడమంటే కేవలం రాయితీనో, నామమాత్రపు చర్యనో కాదు. మరింత ప్రాతినిధ్యం, సమర్థవంతమైన ప్రజాస్వామ్యం వైపు అవసరమైన అడుగు.

**ఇప్పటికే క్రీడలు మనకేం చూపించాయి**

నేను 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్లో పోటీపడి, సెకనులో అతి తక్కువ తేడాతో పతకాన్ని కోల్పోయినప్పుడు, ప్రపంచ వేదికపై తమను తాము చూసుకోగలిగే భారతీయ అమ్మాయిలు చాలా తక్కువ మంది ఉండేవారు. దశాబ్దాలు గడిచేకొద్దీ ఆ పరిస్థితి మారింది. శిక్షణ, మౌలిక సదుపాయాలు, గుర్తింపు పొందే అవకాశాలు మెరుగుపడటంతో, దేశ మహిళలు అంతర్జాతీయ స్థాయిలో ప్రాముఖ్యతను సంపాదించుకున్నారు. పి.వి. సింధు, మీరాబాయి చాను, వినేష్ ఫోగట్, మేరీ కోమ్ వంటి క్రీడాకారిణులు తోడ్పాటు లేకుండా అకస్మాత్తుగా రాణించలేదు. వారంతా వ్యవస్థ సాధించిన ఫలితం; ఆ వ్యవస్థ క్రమక్రమంగా అవకాశాలను విస్తరింపజేసింది. ప్రాతినిధ్యం ఆశయాన్ని సృష్టిస్తుంది–ఆ ఆశయానికి తగిన తోడ్పాటు లభించినప్పుడు అది విజయాన్ని సాధిస్తుంది. మహిళలకు అవకాశం కల్పిస్తే, వారు కేవలం పాల్గొనడమే కాదు–అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తారని, ఇది మనకు స్పష్టంగా తెలియజేస్తుంది.

**ప్రతి భారతీయుడికి మెరుగైన పాలన**

ఇప్పటికే క్షత్ర స్థాయిలో మహిళా నాయకత్వ ప్రభావాన్ని భారత్ చూసింది. 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయితీ రాజ్ సంస్థలలో మహిళలకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టినప్పటి నుంచి, మహిళా ప్రతినిధుల నాయకత్వంలో తాగునీరు, పారిశుధ్యం, విద్య, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ వంటి సౌకర్యాలు మెరుగుపడినట్లు వివిధ రాష్ట్రాల్లో నిర్వహించిన పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఇవి కేవలం 'మహిళా సమస్యలు' మాత్రమే కావు; ఇవి జాతీయ ప్రాధాన్యతలు. సురక్షితమైన బహిరంగ ప్రదేశాలు, క్రమశిక్షణతో సాగుతున్న పాఠశాలలు, పోషకాహారం, ఆరోగ్య సేవలు వంటివి కుటుంబాలను, సమాజాలను నేరుగా ప్రభావితం చేసే నిత్య పాలనా సవాళ్ల పై మహిళా నాయకులు దృష్టి సారిస్తున్నారు. ఈ ప్రాతినిధ్యాన్ని రాష్ట్ర శాసనసభలకు, పార్లమెంటుకు విస్తరింపజేయడం కేవలం న్యాయానికి సంబంధించిన విషయం మాత్రమే కాదు, పాలనపరమైన నాణ్యతను మెరుగుపరచే విషయం.

**ప్రాతినిధ్యం వెనుక ఉన్న ఆర్థిక కారణం**

దేశంలో మహిళా కార్మిక శక్తి భాగస్వామ్యం దాదాపు 25 శాతం వద్దే నిలిచిపోయింది. ఇది. ప్రపంచంలోనే అత్యంత తక్కువ. ఇంకా, ఇది కేవలం సామాజిక ఆందోళన మాత్రమే కాదు–ఒక ఆర్థికపరమైన పరిమితి కూడా. చట్టసభలలో మహిళలకు మెరుగైన ప్రాతినిధ్యం కల్పించడం వల్ల, వారిలో దాగి వున్న సామర్థ్యం ప్రాధాన్యత విధానాలకు తోడ్పాటును అందివ్వొచ్చు: తక్కువ ఖర్చుతో కూడిన శిశు సంరక్షణ, సురక్షితమైన పని ప్రదేశాలు, రుణ సదుపాయం, మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతు వంటివి ఇందులో ఉన్నాయి. లింగ సమానత్వాన్ని పెంపొందించడం ద్వారా భారతదేశ జిడిపికి దాదాపు 700 బిలియన్ డాలర్లు అదనంగా చేరుతాయని మెకిన్సే గ్లోబల్ ఇన్స్టిట్యూట్ అంచనా వేసింది. మరింత సమగ్రమైన పార్లమెంటు అనేది కేవలం ప్రజాస్వామ్య అవసరం మాత్రమే కాదు; అది ఒక ఆర్థిక అనివార్యత కూడా.

**భద్రత, గౌరవం మరియు భాగస్వామ్యం**


దేశ వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలకు, ప్రజా జీవితంలో భాగస్వామ్యం అనేది ఇప్పటికీ భద్రత, వివక్ష, సమాన అవకాశాలు లేకపోవడం వంటి ఆందోళనలతో ముడిపడి ఉంది. క్రీడలు, విద్య లేదా పని ప్రదేశం–ఏదైనా కావచ్చు, ఈ అడ్డంకులు ఇంకా లోతుగా పాతుకుపోయి ఉన్నాయి. పార్లమెంటులో ఎక్కువ మంది మహిళలు ఉండటం అంటే, చట్టాలు, విధానాలు కేవలం బయటి అవగాహనతో కాకుండా, నిజ వాస్తవాల ఆధారంగా రూపొందుతాయని అర్థం. దీనివల్ల చట్టాల అమలు కోసం బలమైన వాదనలు వినిపించడం, సహాయక వ్యవస్థల కోసం వనరుల మెరుగైన కేటాయింపు, స్పందనాయుతమైన, సులభంగా అందుబాటులో ఉండే న్యాయ చట్రం ఏర్పడతాయి. పాలన అనేది ఎవరి కోసం ఉద్దేశించబడిందో, వారి అనుభవాలను ప్రతిబింబించినప్పుడే అది మరింత సమర్థవంతంగా మారుతుంది.

**ప్రాతినిధ్యం, ఆశయ శక్తి**

భారత్లో అధికారంమంటే సుదీర్ఘకాలం పాటు ప్రధానంగా పురుషులదే. ఈ అంశాన్ని మార్చడమనేది కేవలం ప్రతీకాత్మకమైనది మాత్రమే కాదు–విప్లవాత్మక మార్పు కూడా. మణిపూర్, జార్ఖండ్, రాజస్థాన్ లేదా దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన యువతికైనా, తనలాగే కనిపించే, తనలాగే మాట్లాడే, తనలాంటి నేపథ్యం నుంచి వచ్చిన ఒక మహిళ దేశ చట్టాలను రూపొందించడం చూసినప్పుడు, ఆమెలో స్ఫూర్తి నిండడమే కాదు, తాను ఏమైనా సాధించగలననే నమ్మకాన్ని ఇస్తుంది. ఆశయం అనేది సామాజిక మార్పుకు చోదక శక్తి. చట్టసభలలో రిజర్వేషన్లు అనేవి ప్రమాణాలను తగ్గించవు; అవి అవకాశాల పరిధిని విస్తరిస్తాయి. భారతీయ మహిళలు ఇప్పటికే క్రీడా రంగాలు, సాయుధ దళాలు, విమానయానం, కార్పొరేట్ బోర్డు రూమ్లలో అడ్డంకులను అధిగమించారు. ఆ ప్రయాణంలో శాసనసభ ప్రాతినిధ్యం అనేది ఒక సహజమైన తదుపరి అడుగు.

**కార్యాచరణకు ఇదే సరైన సమయం**

రాజ్యసభ సభ్యురాలిగా సేవలందించే గౌరవం పొందిన నేను, విభిన్న దృక్పథాలు.. చర్చలను, నిర్ణయ ప్రక్రియను ఎలా బలోపేతం చేస్తాయో ప్రత్యక్షంగా చూశాను. అయినప్పటికీ, నేడు లోక్సభలో మహిళల ప్రాతినిధ్యం కేవలం 15 శాతంగానే ఉంది–ఇది ప్రపంచ సగటు కంటే చాలా తక్కువ. నారీ శక్తి వందన్ అధినియం ఆమోదం పొందింది. ఇక మిగిలింది దానిని పూర్తిస్థాయిలో, చిత్తశుద్ధితో, ఆలస్యం లేకుండా అమలు చేయాలనే రాజకీయ సంకల్పమే. దేశ జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు అత్యున్నత నిర్ణయాధికార వ్యవస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించకుండా, భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని ఆశించలేదు. సగం ప్రతిభను పక్కన పెట్టి 'వికసిత్ భారత్'ను నిర్మించలేము, అలాగే కేవలం సగం గొంతులతోనే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లలేదు. ముందున్న మార్గం స్పష్టంగా ఉంది. ఆ మార్గంలో నడవాలనే పట్టుదల మనకు ఉందా లేదా అనేదే ఇప్పుడున్న ప్రశ్న.




రచయిత: **డాక్టర్ పి.టి. ఉష**
**(రాజ్యసభ ఎంపీ; భారత ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు, కామన్వెల్త్ గేమ్స్ అసోసియేషన్, భారత అధ్యక్షురాలు)**


# సిలికా, క్వార్జ్ దోపిడీని అరికట్టాలని కాంగ్రెస్ ధర్నా

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సైదాపురంలో కొందరు పెద్దలు గూడూరు ప్రాంతంలో సిలికా, క్వార్జ్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ సోమవారం నెల్లూరు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది.

ఈ సందర్భంగా తిరుపతి మాజీ ఎంపీ డాక్టర్ చింతామోహన్ మాట్లాడుతూ సైదాపురం ప్రాంతంలో క్వార్జ్ రాయిని కొందరు ధనవంతులు అక్రమంగా తరలించి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. అలాగే గూడూరు నుంచి సిలికాను అక్రమంగా రవాణా చేస్తూ అక్రమార్జ నకు పాల్పడుతున్నారని విమర్శించారు. అనుమతికి మించి రవాణా సాగిస్తూ ప్రజాసంపదను దోపిడీ చేస్తున్నారని ఆరోపిం చారు. ప్రజా సంపద ధనవంతులకే పరిమితమైందని ఆ సంపద కొందరికి కాకుండా అందరికీ చెందాలని డిమాండ్ చేశారు. తొలుత ఆయన గ్రీవెన్స్ డేలో ఇదే విషయమై కలెక్టర్ హిమాన్స్ శుక్లాకు కాంగ్రెస్ పార్టీ తరపున వినతి పత్రం సమర్పించారు. ఈ సిలికా, క్వార్జ్ గనులను ధనవంతులకు బదులు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan